బొమ్మ-బొరుసు

శ్రీ శివల జగన్నాథరావు

బద్ధకంగా దుప్పటిని పక్కకి తప్పించి అప్పారావు నిద్రలేచేసరికి, ఎదురుగా గూట్లోవున్న వాచీ ఆరూ పదినిమిషాలు చూపించింది. హడావిడిగా దుప్పటి మడతబెట్టాడు. సింహాచెలం అంతకుముందే లేచి నట్టున్నాడు. వీధికుళాయి దగ్గర పళ్లుతోముకుని, స్నానంచేశాడు. షాపులోకివచ్చి, బల్లసొరుగులోంచి రెండు వూదొత్తులు తీసి, వెంకట్రవణమూర్తి పటం దగ్గిర అగ్గిపుల్లతో అవి వెలిగించి, పటం చుట్టూ తిప్పి, అక్కడ కన్నంలో గుచ్చాడు. ఈ లోపల అప్పారావు గబగబా మొహం కడుక్కువచ్చి, మూలనున్న చీపురు తీసుకుని ఆ గది నాలుగు మూలలూ తుడిచాడు. అప్పారావు ఒకసారి బస్టాండు కేసిచూసి, గోడకాన్చివున్న బల్లమీంచి చిన్నగిన్నె తీసుకుని, కుళాయిదగ్గిర పెద్దకుండతో పట్టితెచ్చిన నీళ్లలోంచి కొంచెంనీళ్లు తీసుకుని, గూట్లోంచి పసుపు పొట్లంతీసి, కాస్త పసుపు నీళ్లల్లో కలిపి షాపులో దేవుళ్ల పటాలమీదా, వస్తువులమీదా, నేల మీదా చిలకరించాడు. సింహాచెలం ద్వారంగుండా బస్టాండువేపు తదేకంగా చూట్టం గమనించి, అటు చూసి, ఈ లోపున ఎవరో రాగా, కూచోమని ఓ కుర్చీ దులిపి చూపాడు. జేబులోంచి దువ్వెన తీసుకుని, నీళ్లతో తడుపుకున్న జుత్తుని నీటుగా దువ్వుకుని, కాస్త పౌడరు మొహానికి రాసుకున్నాడు. వారపత్రికలో సినిమాబొమ్మలు శ్రద్ధగాచూస్తున్న ఆసామీ, అప్పారావు 'రండి, సార్' అనగానే రాచఠీవితోలేచి, సింహాసనాన్ని అధిష్టించినంత దర్పంతో (రివాల్వింగ్‌చైర్) తిరుగుడు కుర్చీలో కూచున్నాడు. అప్పారావు ఫ్రెష్‌గా వున్న దుప్పటిగుడ్డ ఆసామీ మెడవిూంచి చుట్టూ తిప్పికట్టి, కత్తెరా, దువ్వెనా తీసుకున్నాడు. ఈలోపల మరో ఆసామీ, ఇంకో ఆసామీ వచ్చారు. క్షురకర్మ కోసం కాకుండా కేవలం కబుర్లకోసమేవచ్చిన ఒకాయనతో 'కబుర్లు' మొదలయ్యాయి.

వాళ్లిద్దర్లో సింహాచెలం పెద్దవాడు. ఎనిమిదో క్లాసుచదివి, ఆపైన చదవడానికి విసుగేసి, అప్పుడు తండ్రి చనిపోతూ అప్పగించిన షాపుని తన స్వంతతెలివితో వృద్ధిచేశాడు. బార్‌లైట్లు—రేడియో—మరిరెండు తిరుగుడు కుర్చీలు—కొత్త సామానూ ...అభివృద్ధికి నిదర్శనాలు. అంతఎక్కువగాలేని దేవుళ్ల పటాలు — వాటికి రెండు మాత్రమే గుచ్చిన వూదొత్తులూ మోడ్రన్‌భక్తికి నిదర్శనాలు. బల్ల విూద కొనివుంచే దిన, వార పత్రికలు రెండూ కాలక్షేపానికీ, వచ్చిన బేరగాళ్లని పట్టినిలపటానికీ గల ఆకర్షణీయ సాధనాలు. ఎడతెరిపిలేకుండా సాగే కబుర్లు సందడినీ, చురుకుదనాన్నీ ద్యోతకంచేసే వ్యాపార రహస్యాలు......

ఒకసారి బస్టాండువేపుచూసి, నిన్ననే విడుదలైన తన అభిమాన నటుడి సినిమా ఎలావుందో చెప్పసాగాడు సింహాచెలం.

'రెండోఆట కెళ్లేను. సెట్టింగులు గొప్పగా వున్నాయి గురూ! డయిలాగులు మోతనుకో! ఇంక... ఆడి యాక్టనంటావా? తినేసేడు పిక్చర్ని...'

'నువ్వేమంటే అను గురూ...మిగతా యెన్ని బాగున్నా పిచ్చరికి కత ముఖ్యం. ఇందలో 'కత' నేదు. పాటల్సరేసరి...' అన్నాడు కబుర్లకొచ్చిన కాకీషర్టు సైదులు.

'అవితే ఎన్ని వోరా లాడుద్దంటావ్?'

'వోరాలా? హెహె......వోరం రోజు లాడితే సూద్దారి'

ఇంతలో గడ్డం గీయించుకుంటున్న ఆసామి ఆ పిక్చర్లో హీరోగురించి కలుగజేసుకున్నాడు. సింహాచెలం ఆయనకేం జవాబు చెప్పలేదు. నవ్వి వూరుకున్నాడు. తన కిష్టమయిన హీరో ఆయనకి ఇష్టం వుండక పోవచ్చు. ఇక్కడవున్న వాళ్లల్లోకూడా ఆ హీరో కిట్టక పోయుంటే—తనిష్టం వూ సలావుంచి—వచ్చే వీళ్ల బేరాలు పోతాయి! అందుకని 'అవునూ' ఒద్దు. 'కాదూ' ఒద్దు!...జవాబుచెప్పని సింహాచెలం నవ్వులో అంత అర్థంవుంది!

అప్పారావు అన్నదగ్గరగా వెళ్లి ఏదో చెప్పాడు. ఇద్దరూ బస్టాండుకేసి రెండుక్షణాలు సాలోచనగా చూశారు, కనుబొమలు ముడివేసి.

కబుర్లు ఎక్కడెక్కడికో మలుపులు తిరిగాయి,

ధరలు—యుద్ధం—ఎన్నికలు—ఓట్లు———

వీధికుళాయి దబదబ నీళ్లచప్పుడు — బిందెల మోత—గోడ కమర్చిన అద్దంలో రోడ్డుమీద ఆయా సంగా ఆగిన బస్సు—బిల బిలా మనుషులు—'థబ్! థబ్!' బస్సుమీద కొట్టిన శబ్దం—'రాయిట్' కండక్టరు అరుపులు! బస్సు వెళ్లింది, గంపెడు దుమ్ము అక్కడవున్నవాళ్ల మొహాన్నకొట్టి.

సింహాచెలం గడ్డంగీసిన మకిలి మోచేతికి రాచుకుని అవతలికి చూశాడు. బస్టాండులో ముసలమ్మింకా చిరుగులపాతలో ముడుచుకు పడుకునేవుంది. దానికి నూరేళ్లు ఎప్పుడో నిండిపోయుంటాయని సింహాచెలం అనుకుంటాడు. ఎముకలూ, వాటికి అంటుకునీ, అంటుకోకా వేలాడుతున్న త్వక్కూ తప్ప దానిఒంట్లో ఇంకేం మిగల్లేదు. నెత్తురూ, మాంసం, వయసూ, పరువం అన్నీ ఎప్పుడో కాలం తీసేసు కుంది. ప్రాణం ఒక్కటే తీసుకుందికి భగంవంతుడు ఎదురు చూస్తున్నాడు. బస్టాండులో ఓ స్తంభందగ్గర పెద్ద గిడుగు (తాటాకు గొడుగు) నేల్న పాతి, దాని నీడలో—తన గూడుని ఏర్పాటు చేసుకుంది, ముసలమ్మ. అది కప్పం కట్టక్కర్లేని సామంతరాజ్యం! అద్దె చెల్లించ నవసరంలేని నివాసం! ఏమో, మరి! ఇంతవరకు ఎవరూ దాన్ని ఆ జాగాకి అద్దె, పన్ను వగయిరాలు అడగలేదు!

ఓ గోనెపట్టా—చిరుగుల దుప్పటి—మూటగా కట్టిన పాతకోక(లెండు — డాల్డాడబ్బా — పింగాణీ ప్లేటు—ధృఢంగావున్న క్రర — చుట్టుపక్కల ఇళ్లకి వెళ్లి గంజి, అన్నం అదీ అడుక్కు తెచ్చుకుంటుంది. గోనెపట్టామీద కూచుని బస్టాండులో చేరినవాళ్లని అడుక్కుంటుంది. సెలూను సింహాచెలం, అప్పారావులకే కాదు; కాకాహోటేలు సర్వరు పాపారావుకీ ముసలమ్మంటే జాలే! అభిమానంవే! అది ఎప్పుడేనా మూలిగి పడుకుంటే దాని వేళలు కనిపెట్టి తాగడానికో, తినడానికో 'ఇంత' తెచ్చిచ్చి, అది అడుక్కున్న డబ్బులు పట్టుకుపోతారు. ఒకవేళ పాపారావు పలక్కపోతే సెలూను అన్నదమ్ములు సాయపడతారు.

'రోజూ తెల్లారుతూనే లేస్తుంది. చలి ఎక్కువగావుంటే కొంచెం ఆలస్యంగా లేస్తుంది. అంతేగాని ఇంతసేపు ఎప్పుడూ లేవకండా వుండలేదే!'—అనుకున్నాడు, సింహాచెలం ఆశ్చర్యంగా. 'ముసిరి ముండగదా. ఒంట్లో నలతగా వుందేవో?! నిన్నలా ఇవాళ వొయసులో వున్నోళ్ళే వుండరు. అలాంటిదీ...' అనుకున్నాడు.

అతని నోటివెంట నిట్టూర్పు వెలువడింది.

ఒకేచోట వుంటూ, రోజూ మొహాలు చూసుకునే మనుషులమధ్య ఇష్టం, మమకారం లాంటి అనుబంధాలు చోటు చేసుకోవడానికి, వాళ్లనడుమ రక్తసంబంధాలే వుండక్కర్లేదు. బాంధవ్యం నెలకొనక్కర్లేదు.

సెలూనోకి ఎవరెవరో వస్తున్నారు. వెళుతున్నారు. కబుర్లుసాగుతూనే వున్నాయి. రోడ్డుమీద బస్సులు ఆగుతున్నాయి. వెళుతున్నాయి. ఎండ ఎక్కుతోంది. కుళాయి కట్టెయ్యటానికి సిద్ధంగా వుంది. ముసలమ్మ ముడుచుకు పడుకునే వుంది.

నిన్న ముసలమ్మ కొడుకు వచ్చాడు. రూపాయో అర్ధో ఇవ్వబోతే వద్దంది. తీసుకొమ్మని బతిమిలాడేడు. తీసుకోనని మొరాయించింది. తినడానికి హోటల్నించి ఏవో తెచ్చాడు. ముసలమ్మ తీసుకోలేదు.

ఈ భాగోతం ఎప్పుడూ సాగుతున్నదే. అడుక్కునయినా తింటుందిగాని కొడుకుని మాత్రం అడగదు! అడక్కుండా వాడిచ్చినా వుచ్చుకో దేదీని! ఇంటికి

రమ్మంటే ఏదో తిట్టి 'ఆవూసెత్తిక' అంది! కాకా హోటలు ప్రొప్రయిటరూ, హెయిర్ కట్టింగ్ సెలూను సింహాచెలం, కావిళ్లు మోసే గవరయ్యా, ఇంకా మిషనుకుట్టే రాఘవులూ అంతా ముసలమ్మని కొడుకువెంట వెళ్లిపొమ్మన్నారు.

ముసలమ్మ కొడుకు అప్పల్స్వామి ఏదో ఆఫీసులో బంట్రోతుగా పనిచేస్తున్నాడు. ముసలమ్మకి అప్పల్స్వామి ఒక్కడే సంతానం. అంట్లుతోమీ, నీళ్ళు మోసీ ఒంట్లో వోపిక వుడిగేవరకూ, అప్పల్స్వామికి ఒక వయసు వచ్చేదాకా ముసలమ్మ వాణ్ణి కష్టపడి, అపురూపంగా పెంచింది. చదువు బాగా చెప్పిద్దామనుకుంది గాని వాడికి ఎనిమిదోక్లాసుకిమించి చదువబ్బలేదు. ముసలమ్మ ఒంట్లో జవసత్వాలుడిగిపోయేయి. చదివి గుమాస్తావుద్యోగం గౌరవంగా చేస్తాడనుకుంటే అప్పల్స్వామి బంట్రోతుపని సంపాదించి అందులో స్థిరపడిపోవడం ముసలమ్మకి ఎలక్ట్రిక్ షాకయింది. ఆ తరవాత అప్పల్స్వామి పెళ్లి విషయంలోనూ తల్లి అభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రవర్తించాడు. తల్లి చెప్పిన పిల్లనికాకండా తమ జాతితప్పిన పిల్లని తనిష్టంమీద కట్టుకున్నాడు. అప్పుడే ముసలమ్మ కొడుకుతో పెద్ద తగాయిదాపడి విడిపోయింది. 'అడుక్కు తింటానుగాని, నీ దగ్గరవుండను. నీచేతి నీళ్లుకూడా తాగను' అంది వచ్చేస్తూ! ఇప్పటికీ ఆమాట మీదేవుంది! ఈకథ చుట్టుపక్క అందరికీ చెప్పి కొడుకునీ, కోడల్నీ వెయ్యి శాపనార్థాలుపెట్టి తిడుతుంది! అప్పల్స్వామి వచ్చివెళ్లిననాడు మరీ తిడుతుంది!

'ముసిలిముండాకూతురి కెంత పట్టుదల? ఎంతపగ!' అని అంతా ఆశ్చర్యంగా చెప్పుకుంటారు.

అప్పల్స్వామి ఓరోజువచ్చి ఆత్రంగా తనకి కూతురు పుట్టిందని, చూడ్డానికి రమ్మని చెప్పాడు. ముసలమ్మ—'కూతురుపుడితే నాకుచెప్పడం ఎందుకు? పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరా. అదో విడ్డూరవా?' అంది. అప్పల్స్వామి హతాశుడయ్యాడు. వాడికి చాలాకోపం వచ్చింది. 'ఛస్! నీకు చెప్పడం నాది బుద్ధితక్కువే' అని వెళ్లిపోయాడు. ఆ తరవాత వారం రోజుల్దాకా ముసలమ్మ అక్కడందర్తో 'సూడండి బాబుల్లారా...ఆడే దిక్కుమాలిందానికో పిల్లనికంటే నానెళ్ళి సూడాలంట. నాకేం పట్టింది? నానేం ఎల్లను. సూణ్ణు' అంది.

'చూడకపోతే మానెయ్యిగాని ఇంక వూరుకో! వాడిఊసు అక్కర్లేదంటూ అదేపనిగా వల్లిస్తావేం?' అన్నాడు కాకాహోటలు ప్రొప్రయిటరు నవ్వుతూ.

'మామ్మా...నిన్న నేను అటుపక్క వెళ్ళాను. నీ మనవరాల్ని చూసేను. అచ్చం నీపోలికే అనుకో! ఆముక్కూ, చెవులూ అంతా నువ్వే' అని చెప్పి పకపకా నవ్వాడు సెలూను అప్పారావు.

ముసలమ్మ మాట్లాడలేదు. అప్పట్నించి తనలో ఏదో గొణుక్కోడం తప్పించి ఎవరితో కొడుకు వూసెత్తడం మానేసింది. ఇది జరిగి ఆరుమాసాలయింది. రోజులు వెళుతున్నాయి—ఎండ వస్తోంది. చల్లబడుతోంది. వాన కురుస్తోంది. ఆగుతోంది. చలివేస్తోంది. పోతోంది. రోడ్డుపక్కన—బస్టాండులో ఆ తాటాకు గిడుగునీడలో—ముసలమ్మ అడుక్కుతింటూనే వుంది. అడిగినాకూడ ఇప్పుడు తన కథ ఎవరితో చెప్పడంలేదు!

సింహాచెలం తదితరులు ముసలమ్మ మూగతనానికి ఏవేవో కారణాలు వూహించుకుని, చెప్పుకుని, యాతన పడుతున్నారు.

మానవ స్వభావం చిత్రంగా వుంటుంది! ఒక చెడ్డవాడిలో హఠాత్తుగా మంచి చూస్తే ఎలా విపరీతంగా, అసహజంగా అనిపిస్తుందో — రోజూ కనిపించే వ్యక్తి కనిపించకుండా పోతే ఎలావుంటుందో—బడ బడా వాగేమనిషి వున్నట్టుండి మూగబోతే అలాగే అసహజంగా, ఆశ్చర్యంగా అన్పిస్తుంది. కారణం వెదకాలనిపిస్తుంది. కుతూహలం చెలరేగుతుంది. ఈ పరిణామాలికికూడా ఆ మనుషులమధ్య అనుబంధాలు వుండి తీరక్కర్లేదు.

చాలా రోజులికి—నిన్న అప్పల్స్వామివచ్చి, తల్లి యోగక్షేమాలు విచారించి, ఇంటికిరమ్మని అడిగి, 'రాన'నిపించుకుని, అందరితో ఆవైనం చెప్పుకుని వెళ్లాడు. కొడుకు వున్నంతసేపు ముసలమ్మ వాడితో ఆప్యాయంగా మాట్లాడక పోయినా—వాడి మొహంలోకి దేన్నో వెదుకుతున్నట్టు చూస్తూనే వుంది. ఏదో చెప్పాలని, చెప్పలేని ఆరాటం, బాధ దాని బోసినోటి

కదలికల్లోనూ, చలించే ముడతల్లోనూ ద్యోతక మౌతోనేవున్నాయి.

కొడుకు వెళ్ళిపోయేక, ముసలమ్మ ఎక్కడికో అడుగులో అడుగువేసుకుంటూ వెళ్ళి, చంకలో ఏదో మూటకట్టుకు రావడం సెలూనులోంచి సింహాచెలం చూశాడు. 'అన్నంమూట కట్టుకురాదే!' అను కున్నాడు. తర్వాత తనపనిలో పడిపోయాడు.

*   *   *

వెళ్ళిపోయిన ఆసామీఇచ్చిన రూపాయి జేబులో వేసుకుని సింహాచెలం బయటికి వెళ్ళాడు. నెమ్మదిగా ముసలమ్మ పడుక్కున్న చోటిని సమీపించేడు. ముఖం మీంచి మాసికలదుప్పటి కప్పుకుంది. దుప్పటి తీశాడు. కళ్ళు సగంతెరిచి వున్నాయి. నోరు పూర్తిగా తెరి చేసి వుంది. అంచేత ఆ జీవుడు నోట్లోంచిపోయిందో, కళ్ళలోంచి పోయిందో చెప్పడం కష్టం!

సింహాచెలం ఎందుకో తుళ్ళిపడినట్లయి, ఒక డుగు వెనక్కివేసి తమ్ముణ్ణి పిలిచాడు. అప్పారావు పాపారావుని లాక్కొచ్చాడు. వాడివెంట హోటలు ప్రొప్రయిటరు, మిషనురాఘవులు ఇలా పదిమంది దాకా వచ్చారు.

ముసలమ్మ మరణం అసహజంకాదు. అది ఎప్పుడో ఓరోజిలా చెప్పా చెయ్యకండా పైకి వెళ్ళిపో తుందని వాళ్ళందరికీ తెలుసు. అయినా మళ్ళా ఏదో విస్మయం! కాస్సేపు విచారించి—కాస్సేపు దానిపంతం గురించి చెప్పుకుని — అప్పల్స్వారిని పిలిచి చేయించే కర్మ గురించి తర్కించుతుంటే—సింహాచెలం ఏదో జ్ఞాపకం వచ్చినట్టయి—ముసలమ్మ నిన్న ఎక్కడికో వెళ్ళి కట్టుకువచ్చిన గుడ్డమూట విప్పాడు. అందులో ఒక లక్కకాయ — రెండు రబ్బరుబొమ్మలు — ఓ ప్లాస్టిక్ బూరా—కొన్ని చిల్లరడబ్బులు వున్నాయి.

సింహాచెలం కళ్ళు పెద్దవిచేసి నవ్వుతూ అందరి వేపూ చూశాడు. అందరిలో ఇంచుమించు ఒకేభావం నిండింది. ఆ భావానికి భాష్యం చెప్పడానికిమాత్రం అప్పుడు వాళ్ళదగ్గర భాష రెడీగాలేదు.